సాలెగూడు

పరిమళా సోమేశ్వర్

సేఠ్ గోవిందలాల్ [illegible]

రోజూ [illegible] తీపి [illegible] విందుభోజనం చేస్తూ శరీర[illegible] సులో అంతటా [illegible] ఓ చిన్నారి [illegible]గ [illegible] కళ్లను రెపరెపలాడిస్తూ పైకి చూ[illegible] తనకి [illegible] ఆ గదిలో రెండుగోడలు కలిసే మూల పైభాగంలో కనపడిన ఒక [illegible] వస్తువుని చూసి అక్కడే నిల[illegible] ఆ అందాల బరిణ. సేఠ్ గోవిందలాల్ యొక్క ఏకైక పుత్రిక సునీత ధరించే వలువలకన్న సుకు

మారంగా, అందంగా, కళాత్మకంగా ఉన్న ఆ పవిత్రవాన్ని చూసి అచ్చెరువొందింది. అంత గొప్ప కళాఖండాన్ని సృష్టించిన ఆ పరబ్రహ్మ ఎవరా అని ఆలోచిస్తూ నిలబడింది.

ఏదో ఒక బలీయమైన శక్తి ప్రభావం వల్ల దానివైపు ఆకర్షితురాలై పోతోంది ఆ చిన్నారియాగ. మత్తుగా మందంగా ఒక్కొక్క అడుగేస్తూ దాని సమీపించింది. దగ్గరకు వస్తున్నకొలదీ దాని అందాలు మరింత స్పష్టంగా, దివ్యంగా వెలిగిపోతూ ఆమెను సమ్మోహితురాలిని చేస్తున్నయ్.

అల్లంతదూరంలో నిలబడి అంత వరకు ఆమె కదలికలను గమనిస్తూన్న ఓ మూనూగు మీసాల యాగ వడివడిగా దానివైపుకు వెళ్ళింది.

ఒక విచిత్రమైన సమ్మోహనావస్థలో పడిపోయిన ఆడయాగ పరిసరాలనుకూడా గమనించకుండా మెల్లగా అందులోకి ప్రవేశించింది. కాలికి మెత్తగా, సున్నితంగా తగిలిన దారపుపోగుల స్పర్శకు ఉలికిపడి కళ్ళు తెరిచింది. తనచుట్టూ అల్లిబిల్లిగా అల్లుకుపోయిన దారాలను అమాయకంగా, ఆశ్చర్యంగా చూసింది మరుక్షణమే ఆమెకు తన కాళ్ళక్రింది భూమి ప్రచండవేగంతో కదలిపోతున్నట్లు, చెలియలికట్టను దాటి సముద్రాలు పొంగి పొరలుతున్నట్లు అనుభూతి కలిగింది. ఆమె కళ్లు బైర్లు కమ్మినయ్. ఆమె చెవులు హోరుమంటున్నయ్. తన అంగాలను బంధించివేసిన ఆ దారపు పోగులు మృత్యుశృంఖలా లని గుర్తించటానికి ఎంతోసేపు పట్టలేదామెకు.

ఇదంతా చూసి ఆమెను రక్షించటానికి ఆత్రంగా పరుగుపెడ్తూ వచ్చింది మగయాగ. వికృతంగా నవ్వుతూ తన కబంధహస్తాలను చాచి వస్తున్న సాలెపురుగును చూస్తూనే కెవ్వున కేకవేసి సాలెగూడులోకి ఉరికింది మగయాగ. మరునిమిషంలోనే ఆ రెండుయాగలూ సాలెపురుగు ఆకలికి ఆహుతి అయిపోయినయ్.

* * *

సేఠ్ గోవిందలాల్ దుకాణానికి ఎదురుగా ఉన్న ఆఫీసులోకి ఆరోజే ప్రవేశించింది సునంద. కాలేజీ చదువు ముగించుకుని ఉద్యోగంలోకి చేరటం ఆమె కదే మొదటిసారి. ఉద్యోగం, ఆఫీసు వాతావరణం, అక్కడి మనుష్యులు, మన స్తత్వాలూ అన్నీ కొత్త సునందకు.

బెరుగ్గా వచ్చి కుర్చీలో కూర్చుంది. మొదట ఎడమచేతికున్న స్క్వేర్ వాచీలో టైము చూసుకుంది. పదిగంటల పైన పన్నెండు నిమిషాలయింది టైము.

తలెత్తి ఆగదిలో తనతో పాటు కూర్చున్నవారందరినీ ఓమారు చూసింది. ఏభై దాటిన హెడ్ గుమాస్తా, ముప్పైలోకి ప్రవేశించినట్లున్న మరిద్దరు

గుమాస్తాలు, పాతికేళ్ళ మరో గుమాస్తా, అదే వయసులో ఉన్న టైపిస్టూ–అందరి కళ్లు తననే గుచ్చిగుచ్చి చూడటం గమనించి యిబ్బందిగా తల దించుకుంది సునంద.

కాసేపు వితారుగా కూర్చుని చేతి వేళ్ళకొనలను పరిశీలనగా చూసుకుంది. తరువాత తను కట్టుకున్న వాయిల్ చీర మీద ఉన్న ప్రింటును నిశితంగా చూసింది కొంతసేపు. తరువాత తన ఎదురుగా ఉన్న టేబుల్ మీద వేసిన దుమ్ముకొట్టుకుపోయిన ఆకుపచ్చని ఆయిల్ క్లాత్ మీది డిజైన్ వంక, బల్లమీద అటూయిటూ ఉన్న ఫైళ్ళవంక చూసిన ఆమె కళ్లు కొంచెం పైకిపోయి మళ్ళీ రెండుమూడు జతల కళ్లు తనవైపుకే చూడటం గమనించి విసుగ్గా క్రిందికి వాలినయ్. ఇబ్బందిగా కుర్చీలో అటూయిటూ కదిలింది సునంద. అప్పుడే తనువచ్చి అరగంటయింది!

అమాంతం వచ్చిపడుతున్న ఆవలింతను బలవంతాన అణచుకుంది సునంద. తనలా చేయటం ఎవరైనా చూసేరేమోనని చుట్టూ కలయజూసింది మరోమారు. ఏ ఒకరిద్దరో తప్ప అంతా ఎవరికివారు తమ పనుల్లో మునిగిపోయి ఉన్నారు. ఆ ఒకరిద్దరుకూడా తనవంక చూడటం లేదు. "అమ్మయ్య!" అనుకుంది మనసులోనే.

అలా అనుకుందో లేదో వెంటనే మరో ఆవలింత భూతంలా ఆవరించింది. అలా నాలుగైదుసార్లు అయేసరికి ఆమెకి కళ్ళవెంబటి నీళ్ళు వచ్చినయ్. "ఛీ! ఏం పని లేకపోతే యిలాగే తగలడుతుంది," అనుకుంది మనసులో విసుగ్గా.

తన ఎదురుగా ఉన్న ఫైళ్ళను ఓసారి బయటకు తీసింది తను చేరింది బడ్జట్ సెక్షన్ లో. తనకసలే లెక్కలంటే భయం ఎలాగో బాబూ అనుకుంది. ఒక్కొక్కటి ఆరేడు అంకెల పరిమాణంలో ఉండి చిన్న వాక్యాలంత పొడుగున ఉన్న ఆ సంఖ్యలను చూస్తూనే గుండెలో దడ బయల్దేరిందామెకు.

"మిగతావాళ్ళంతా ఎలా చేస్తున్నారో చకచకా! ఖర్మకాలి ఈ ఉద్యోగంలో చేరేను" అనుకుంది.

ఎలాగో ఇంటర్వెల్ టైమయింది. అందరూ గట్టిగా నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ లేచేరు. అందరి కళ్ళూ ఓసారి సునంద వంక నిశితంగా చూసినయ్. తరువాత వాళ్ళు బయటకు వెళ్ళిపోయేరు.

గదిలో తనొక్కర్తే ఒంటరిగా మిగిలింది. హాయిగా, స్వేచ్ఛగా ఓసారి వళ్ళు విరుచుకుంది. తరువాత లేచి నిలబడింది.

గుమ్మందగ్గర ఎవరిదో నీడ కదిలినట్లనిపించి చటుక్కున కుర్చీలో కూర్చుంది

పొందికగా. గంభీరంగా ముఖంపెట్టి అటు చూసింది.

ప్యూన్!

తేలికగా ఊపిరి పీల్చుకుంది సునంద.

"చాయ్ తెమ్మంటారా అమ్మా?" గుబురు మీసాల వెనుక అస్పష్టంగా నవ్వుతూ అడిగాడు యాదయ్య.

"తీసుకురా!" గంభీరంగా ఆజ్ఞాపించింది.

అతను వెళ్ళిపోగానే టేబుల్ మీద వాలి రెండు నిమిషాలపాటు స్వేచ్ఛగా పడుకుంది. తరువాత లేచి ముంగురులు పర్దుకుని ముఖాన్ని పౌడరు పూర్తిగా చెరగనంత సున్నితంగా జేబురుమాలుతో తుడుచుకుంది. మరో రెండు నిమిషాల్లో యాదయ్య టీకప్పుతో ప్రవేశించేడు. ఆమె టీ తాగుతున్నంతసేపూ కొద్ది దూరంలో నిలబడి ఆమెని పరిశీలనగా చూస్తున్న యాదయ్య ఆమెను గురించి ఓ అభిప్రాయాన్ని ఏర్పరుచుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఈ ఆఫీసులో ప్యూన్ నుండి సూపర్నెంటు దాకా అందరికీ క్యూరియాసిటీయే ఆడదంటే!" టీ తాగుతూ అతని వంక గోరకంగానే అతను తనని పరిశీలనగా చూస్తున్నట్లు గ్రహించగలిగిన సునంద అనుకుంది చిరాగ్గా.

టీ తాగటం అయినాక ప్లేటులో పదిహేను పైసలు వేసి అతనికిచ్చింది. యాదయ్య వెళ్ళిపోయేడు.

ఆమె ఒంటరిగా మిగిలింది. వేడి టీ తాగేసరికి కొంచెం చురుకుదనం వచ్చిందామెలో.

ఈసారి కొంచెం రిలాక్స్డుగా కూర్చుంది సునంద. అప్పటికి ఆఫీసు కొంత పాతబడినట్లనిపించింది. రెండయ్యేసరికి అంతా మళ్ళీ ఆఫీసులోకి వచ్చేరు

వాళ్ళు విసురుకుంటున్న జోక్సు, విసుర్లు, వ్యాఖ్యానాలు, నవ్వులు అన్నీ శ్రద్ధగా వింటూ తలవంచుకుని ఫైల్లోకి చూస్తూ కూర్చుంది. కొంతసేపయిన తరువాత సూపర్నెంటు పిలిపించేడామెను ప్యూనుతో. ఆమె తన సీట్లోంచి లేచి సూపర్నెంటు దగ్గరకు వెళ్ళున్నంతసేపూ అందరూ ఆమె వంకే పరిశీలనగా చూడసాగేరు. అదేం గమనించనట్లే తీవిగా నడచి వెళ్ళింది సునంద.

ఆమె చేయవలసిన పనేమిటో వివరించసాగాడు సూపర్నెంటు కనీసం ఆమెను కూర్చోమనైనా అనకుండా. రెండు నిమిషాలు ఆమె నిలబడింది కాని అలా నిల్చోవటం నామోషీ అనిపించి గభాల్న పక్కనేఉన్న కుర్చీని దగ్గరకు లాక్కుని కూర్చుంది.

ఆమె ధోరణికి అదిరిపడ్డాడు సూపర్నెంటు. కాని తన పదిహేనేళ్ళ సర్వీసులోనూ రకరకాల మనస్తత్వాలను చూడటానికి అలవాటు పడినందువల్ల ఏం జరగనట్లే మొహం పెట్టాడు. తరువాత

తన సీట్లోకి వచ్చి ఐదు గంటలవరకు ఏదో పని చేసి ఇంటికి వెళ్ళొంటే ఉద్యోగం లోకి ప్రవేశించడంవల్ల తనచదువుకు సార్థకత కలిగినట్లు, తనలో ప్రత్యేక మైన వ్యక్తిత్వం కలిగినట్లు అనుభూతి కలిగిందామెకు.

అది ఉద్యోగంలో చేరిన మొదటి రోజు అనుభవం... నెలరోజులు గడచి నయ్. సునంద ఒక నెలజీతంకూడా అందుకుంది. ఈ జీవితం గులాబీల పాన్పులా ఉందనుకుంది సునంద. ఇది వరకటిలా ఉదయంలేచిన దగ్గరనుండి రాత్రి పడుకునేవరకు చదువుగురించిన బెంగ, పరీక్షపేపర్లు పాడుచేయటం, ఏడవటం, ఆరోగ్యం పాడుచేసుకో వటం, తోటి విద్యార్థులతో పోటీలు పడటం, నెగ్గకపోతే అవమానపడటం లాంటి బాధలన్నీ తప్పినందుకు ఆమె ప్రాణానికి హాయిగా ఉంది.

ఆఫీసులో ఉన్నంతసేపు చేతనైనంత పనిచెయ్యటం, ఐదు గంటలవగానే ఇంటికి నిశ్చింతగా వెళ్ళటం, సాయంత్రాలు ఏ బాధ్యతాలేకుండా అక్క చెల్లెళ్ళతో, స్నేహితురాండ్రతో సినిమా

లకి, షికార్లకి వెళ్ళటం, తనివిదీరా నిద్రపోయి తెల్లగా తెల్లవారిన తరువాత తీరికగా లేవటం ఆమెకెంతో ఉల్లాసాన్ని కలిగిస్తున్నాయ్. రాత్రింబవళ్ళు పుస్తకాలు ముందేసుకుని కూర్చునే స్టూడెంట్సుని చూస్తూంటే ఆమె కిప్పుడెంతో జాలి కలుగుతుంది.

ఆఫీసులోకూడా అందరూ ఆమెతో మంచిగానే వ్యవహరిస్తారు. ఆమెకిప్పుడు వారిదగ్గర సంకోచం, భయం – ఏమీలేవు. అరమరికల్లేకుండా మాట్లాడుతుంది వాళ్ళతో. వాళ్ళుకూడా ఆమెమీద ఎంతో అభిమానం కనపరుస్తూ మాట్లాడేవాళ్ళు. సునంద వాళ్ళనుగూర్చి ఉద్యోగ విషయాలు, కొంతవరకు యింటి వ్యవహారాల సంగతికూడా తరచుగావాళ్ళ సంభాషణలు వింటుండటం వల్లను, వాళ్ళే స్వయంగా తనకి చెప్పటంవల్లను కూడా తెలుసుకుంది. సూపర్నెంటు పేరు నరసింహం. అతనికి ఐదుగురు పిల్లలు. తన క్రింది ఉద్యోగస్తులను పురుగుల్లా చూస్తూండే వాడు. ఏదోరకంగా ఎవరినో ఒకరిని రోజుకు నాలుగుసార్లన్నా చివాట్లు పెట్టందే నిద్రపట్టదతనికి. మిగతావాళ్ళెవరూ సూపర్నెంటుతో కలసేవాళ్ళు కాదు. ఆఫీసుకు సంబంధించిన పని ఉన్నపుడు అతని దగ్గరకువెళ్ళి నిల్చునే ఆపని చక్కబెట్టుకుని యివతలకు వచ్చేవారు.

జగన్నాధం, రంగారావు యూ.డీ.సీలు. వాళ్ళకు చెరోముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎల్డీసీ మూర్తికి, టైపిస్టు బలరాంకి యింకా పెళ్ళికాలేదు. సునంద జగన్నాధం, రంగారావులతో త్వరగానే కలసిపోయింది కాని కుర్రకారైన మూర్తి, బలరాంలతో చనువుగా మాట్లాడటానికి మొదటకొంచెం సంకోచపడింది. కాని వాళ్ళే కలగజేసుకుని మాట్లాడించటం వల్లను, వాళ్ళ ప్రవర్తనలో ఏమాత్రం అసభ్యతకాని, వెకిలితనంకాని లేకపోవటంవల్లనూ ఆమె వాళ్ళతో కూడా నిర్మొహమాటంగా సంచరించ సాగింది.

లంచ్ టైముతో అందరూకలసే కాంటీన్‌కి వెళ్ళేవారు. మిగతాసమయాల్లో కూడా టీ తెప్పించుకుని అందరూ కబుర్లాడుకుంటూ త్రాగేవారు. నెలాఖరు రోజుల్లో ఒకరిదగ్గర ఒకరు రెండు, మూడు రూపాయలు చేబదుళ్ళుకూడా తీసుకునేవారు. ముఖ్యంగా పిల్లలుగలవాళ్ళవటంవల్ల జగన్నాధానికి, రంగారావుకి డబ్బు అవసరం ఎక్కువగా ఉంటుండేది. ఒకటి రెండుసార్లు సునందని అడిగి కూడా తీసుకునేవారు.

మరోనెల ఎలాటి ఒడిదుడుకులూ లేకుండా గడించింది. ఓరోజు ఆఫీసులోకి ప్రవేస్తూనే అందరూ ఏదో ఆందోళనగా ఉన్నట్లు పసిగట్టింది సునంద.

ఆమెను చూడగానే "రంగారావు గారికి నిజామాబాద్ ట్రాన్స్‌ఫరయిందండీ!" అన్నాడు జగన్నాధం.



"అరె! ఎప్పుడు తెలిసింది?" అన్నది ఆత్రంగా సునంద.

"ఇప్పుడే ఆర్డర్సు వచ్చినాయండీ!" విచారంగా నవ్వుతూ సమాధాన మిచ్చేడు రంగారావు. "ఏడేళ్ళనుండి యీ ఊళ్ళోనే యిదే ఆఫీసులో పనిచేస్తున్నాను. ఇప్పుడు కొత్తఊరికి పోవాలంటే బెరుకుగా ఉందండీ!" అన్నాడు.

"ఫరవాలేదులెండి. ఎందుకంత బెంగ పడిపోతారు, అత్తగారింటికి వెళ్ళబోయే ఆడపిల్లలా? ఎంత కొత్త ఊరైనా కొన్నాళ్ళుండేసరికి పాతబడిపోతుంది కదండీ!" అంది సునంద కొంచెం హాస్యంగా అతని భయాందోళనలను మర్చిపోయేట్లు చెయ్యాలనే ఉద్దేశ్యంతో.

అందరూ నవ్వేరు.

"మీరు వెళ్తే మరి మీ స్థానంలో ఎవరొస్తారో!" అంది సునంద.

"విజయవాడనుండి ఎవరో గోపాలకృష్ణ అనే ఆయన వస్తారని అనుకుంటున్నారు."

ఆ సాయంత్రం రంగారావుకు వీడ్కోలిస్తూ ఘనంగా పార్టీ చేసేరు అతని తోటి ఉద్యోగస్తులు నలుగురూను.

రంగారావు వెళ్ళిన మూడోరోజున గోపాలకృష్ణ వచ్చి ప్రవేశించేడు అతని స్థానంలో.

కృష్ణ ఆఫీసులోకి ప్రవేశిస్తూనే తనని తాను ఎంతోచనువుగా పరిచయం చేసుకున్నాడు అందరితోను.

కృష్ణ ఆఫీసులోచేరిన నెలరోజుల

తరువాత జరిగిన సంఘటన శరాఘాతంలా తగిలింది సునందకు.

ఆరోజెందుకో బస్సు త్వరగా అందటంవల్ల రోజుకన్నా ఇరవై నిమిషాలు ముందే ఆఫీసుకి వచ్చింది సునంద.

ఆఫీసు లోపలికి అడుగుపెట్టబోతూ పెద్దగా గదిగోడలను దద్దరిల్లజేస్తున్న నవ్వులమధ్య తన పేరు వినపడటంచేత ఏదో అనుమానంవచ్చి చటుక్కున గుమ్మందగ్గరనే ఆగిపోయిందామె.

"అది వస్తుందేమో! కొత్త నెమ్మదిగా మాట్లాడు." అది జగన్నాధం కంఠం.

"అప్పుడే రాదులే. ఇంకా చాలా టైముంది పదికి." బలరాం అంటున్నాడు.

"ఆఁ. ఇంతకీ రంగారావు ఉత్తరంలో ఏం వ్రాసేడో పూర్తిగా చెప్పనేలేదూ!" మూర్తి అడుగుతున్నాడు.

"అక్కడ ఆఫీసు చాలా 'డల్'గా ఉందిట. లేడీసెవరూ లేరట. నిన్న మొన్నటిదాకా ఒక క్రిష్టియన్ అమ్మాయి ఉండేదటగాని వీడు వెళ్ళేముందే అదీ కూడా ట్రాన్స్ఫరై వెళ్ళిపోయిందిట మరో ఊరు."

"చొ చ్చొ చ్చొ! పూర్ ఫెలో! రంగారావుకి మంచి కష్టమే వచ్చింది."

"ఔను. మరి, యిక్కడ పంచదార చిలకలాంటి సునందను చూట్టం మరిగేక–"

"అన్నట్టు వీడెవడు–కొత్తగావచ్చిన వాడి పేరు – గోపాలకృష్ణ – వాడు చూసేవా సునందకు పోజులుకొడ్తున్నాడు అప్పుడే."

"వాడు కొట్టటమేం. ఖర్మ! అదే వాడికి పోజులుకొడ్తోంది."

"దానిబొంద. అది వాడికొక్కడి కేమిటి? అందరికీ కొడ్తుంది." అది బలరాం కంఠం.

"అంటే నీకు పోజువేస్తోందనా నీ అర్థం!" మూర్తి.

"లేకపోతే బోడి నీ పర్సనాలిటీ చూసి మూర్ఛపోతుందనుకున్నావా?"

"సర్లే. మీరూరుకోండి. ఇప్పుడు మళ్ళీ దెబ్బలాడుకోకండి. ఎ థింగాఫ్ బ్యూటీ యీజె జోయ్ ఫరెవర్!" జగన్నాధం సర్దిచెప్పేడు.

అందరూ గట్టిగా నవ్వేరు.

ఇంతలో "గుడ్ మార్నింగ్ మిస్ సునందా! ఇక్కడ నిల్చున్నారేమిటి?" అన్న కంఠం విని ఉలికిపడింది సునంద.

"గుడ్ మార్నింగ్ మిస్టర్ గోపాల్!" అంటూ తడబడే అడుగులతో లోపలికి నడిచింది సునంద. కృష్ణ ఆమె ననుసరించేడు.

వాళ్ళిద్దరూ కలిసిరావడం చూసి అక్కడున్న ముగ్గురూ ఒకరి ముఖాలొకరు అర్థవంతంగా చూసుకున్నారు.

"వీళ్ళప్పుడే మంచి ఫ్రెండ్సయినట్లున్నారే!"

"వీడు చూస్తే అసాధ్యుళ్ళా ఉన్నాడు!"



"పిట్టను చేజిక్కించుకునేటట్టే ఉన్నాడు!"

"ఈ రోజుల్లో ఆడదాన్ని లొంగ దీసుకోవటం ఎంతసేపోయ్. ధైర్యం చెయ్యాలేగాని మగవాడు."

"హుష్! సూపర్నెంటు...''

"గుడ్‌మార్నింగ్ సార్!" అందరూ నిలుచుని ఏకకంఠంతో అన్నారు.

తన సీట్లోకి వెళ్ళబోతూ వాళ్ళ ముగ్గురి సంభాషణలలో అక్కడక్కడ కొంతభాగాన్ని విన్న కృష్ణ విషయాన్ని కొంతవరకు అర్థంచేసికోగలిగేడు.

సునంద వాళ్ళ సంభాషణని వివరంగా వినకపోయినా, అది ఏ ధోరణిలో ఉంటుందో ఊహించుకోగలిగింది.

సునంద కారోజు ఏపనీ చెయ్యాబుద్ధి కాలేదు ఉన్నత శిఖరాగ్రాన నిలబడిన వ్యక్తిని అమాంతం ఇగాఢమైన లోయల లోకి త్రోసివేసినట్లుంది ఇప్పుడామె స్థితి.

స్త్రీ ఎలాటి అవమానాన్నైనా భరించ

గలదు కాని తను ఎంతో పవిత్రంగా, కాపాడుకుంటూ వస్తున్న శీలాన్ని స్త్రీత్వాన్ని మరో పురుషుడు తేలికపరిస్తే ఏమాత్రం సహించలేదు. ఇంతవరకు తననెంతో గౌరవిస్తున్నారని, అభిమానిస్తున్నారని భావిస్తున్న తోటి ఉద్యోగస్తులు తనని కేవలం ఒక భోగవస్తువుగా మాత్రమే చూస్తున్నారని, వారి అభిప్రాయంలో స్త్రీ అనే వ్యక్తి పురుషుడి ఆనందంకోసం ఏర్పడిన ఒక విలాస వస్తువనీ, అంతకు మించిన పూజ్యభావం వారిలో లేదని చెవులారా విన్నాక ఆమె మనసు కలతపడసాగింది.

మూర్తి, బలరాం అంటే కుర్రవాళ్లు, పెళ్ళికానివారు కనుక స్త్రీని గూర్చి ఏమీ తెలియక పోవచ్చు. కాని ముగ్గురు పిల్లల తండ్రియైన ఆ జగన్నాథానికి కూడా అదేం జబ్బు? ఆఖరికి రంగారావు కూడా ఉత్తరంలో ఎంత వెకిలి భావాలను తెలిపేడు! ఏమిటి వీళ్ళంతా? ఈ రకమైన మనస్తత్వం వీళ్ళలోనేనా, లేక సమస్త పురుష జాతిలోనూ ఉంటుందా? పైకి ఎంతో డాబుగా, ఠీవిగా కనపడే యీ విద్యావంతుల మనసులో యింతటి కుళ్ళు భావాలకు ప్రవేశం ఎలాకలిగింది?

అలా ఆలోచిస్తూ మనసును ఆఫీసు పనిమీద ఏమాత్రం కేంద్రీకరించలేక పోయింది సునంద. మూర్తి, బలరాం, జగన్నాథం ఎంతో మర్యాద ఒలకబోస్తు ఆమెను ఆప్యాయంగా పలకరించేరు ఎప్పటిలానే. వాళ్ళ నటనను చూస్తుంటే వళ్ళు భగ్గున మండింది సునందకు. "మేకవన్నె పులి అంటే అర్థం పాఠాల్లో చదువుకున్నాను. ఇప్పుడు కళ్ళారా చూస్తున్నాను" అనుకుంది కసిగా.

మధ్యాహ్నం ఏదో పనిమీద కృష్ణ పలకరిస్తే కటువుగా సమాధానమిచ్చింది — పురుషజాతిమీద అసహ్యాన్ని పెంచుకున్న సునంద.

కృష్ణ తెల్లబోయేడు. వెంటనే తల వంచుకుని అవతలకు వెళ్ళిపోయేడు.

అతనలా వెళ్ళిపోతుంటే సునంద నొచ్చుకుంది. "అనవసరంగా అతని మనసును గాయపర్చలేదుకదా?" అనుకుంది. వెంటనే "వీడుమాత్రం మగవాడుకాదూ? కాస్త తేడాతో మగవాళ్ళందరివీ ఒకే రకం బుద్ధులు" అనుకుంది.

సాయంత్రం ఆఫీసయినాక యింటికి వెళ్ళటానికి బస్సుస్టాపులో నిలుచ్చింది సునంద. ఆమెకు పదిగజాల దూరంలో నిల్చున్న కృష్ణ ఆమెనుచూస్తూనే దగ్గరకు వచ్చేడు.

అతనిని చూసి తలవంచుకుంది సునంద.

"మీరేమీ అనుకోనంటే మిమ్మల్నొకటి అడుగుతాను చెప్తారా?" అనడిగాడు కృష్ణ.

"అడగండి" అంది సునంద.

"మీరివాళల్లా ఎందుకంత ముభావంగా ఉన్నారు? నేను పలకరించినప్పు

దుకూడా విసుక్కున్నారు. ఏమయింది మీకు?"

అతనలా అడిగేసరికి సునందకి ఉదయం తను విన్న సంభాషణ జ్ఞప్తికి వచ్చి ముఖం జేవురించింది.

"నాకు యేమీ కాలేదు. ఈరోజు ఒక అసహ్యకరమైన విజాన్ని తెలుసుకున్నాను. అందుకే నాకు చాలా కోపంగా, బాధగా ఉంది" అన్నది ఉద్రేకంగా సునంద.

"ఏమిటా విజం? ... క్షమించండి ...వ్యక్తిగతమైన విషయం కాకపోతేనే చెప్పండి".

"ఇది వ్యక్తిగతమైన విషయం అని నేననుకోను. గడపదాటి బయటకు వచ్చి, చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న ప్రతి భారత స్త్రీకి సంబంధించిన సమస్యే యిది. తమతోపాటు కలిసి పనిచేస్తున్న ఒక స్త్రీని స్త్రీగా తప్ప ఒక వ్యక్తిగా తోటి ఉద్యోగస్తురాలిగా చూడలేని పురుషుల సంకుచిత మనస్తత్వాన్ని యీరోజే అర్థంచేసుకున్నాను. ఈ రోజు మన ఆఫీసులోని వాళ్ళు మాట్లాడుకుంటున్న విషయాలను, ఆ ధోరణిని వింటే అభిమానవతి అయిన ఏ స్త్రీ అయినా సిగ్గుతో తల బ్రద్దలు కొట్టుకుని చావాలని కోరుకుంటుంది" అంటూ చూచాయగా తను విన్నది చెప్పింది సునంద.

కొంచెంసేపు కృష్ణ మాట్లాడలేదు. తరువాత మెల్లగా అన్నాడు. "ఔను సునందా దేవీ! ఈ విషయం ఒక వ్యక్తికీ, ఒక సంస్థకీ సంబంధించినది మాత్రమేకాదు. ప్రతి కార్యాలయంలోను, కంపెనీలలోనూ అలాటి మనస్తత్వంగల పురుషులు కనీసం నూటికి దెబ్బైమందయినా ఉంటారు. కొంతవరకు ఆయా స్త్రీలవేషధారణ, ప్రవర్తనకూడా కారణం కావచ్చు. కాని చెదురు మదురుగా ఉండే ఆ కొద్దిమంది స్త్రీల కారణంగా ఉద్యోగినులందరూ అవమానాల పాలవటం విజంగా అన్యాయం" అన్నాడు కృష్ణ. ఇంతలో తను వెళ్ళవలసిన బస్సు రావటంవల్ల సునంద వెళ్ళిపోయింది.

అప్పటినుండి కృష్ణ, సునంద తరచు బస్సుస్టాండులో నిలబడి ఆరోజు ఆఫీసులో జరిగిన విశేషాలను చెప్పుకుంటూండే వారు.

ఒకరోజున కృష్ణ అన్నాడు. "ఈ మధ్య మీరు వాళ్ళతో మాట్లాడటం మానివేసేరుకదా. అందువల్ల వాళ్ళకు మీమీద చాలా కోపంగాఉంది. ఇప్పుడు నాముందుకూడా మీగురించి నిరసనగా మాట్లాడు కుంటున్నారు."

సునంద నవ్వి ఊరుకుంది. కాని మనసుకి మాత్రం ముల్లు గుచ్చుకున్నట్టుగా అనిపించిందామెకు.

మరోరోజు సునంద లేని సమయంలో మూర్తి "ఏమండి కృష్ణగారూ! ఏమిటి విశేషాలు?" అనడిగాడు భావ గర్భితంగా నవ్వుతూ.

"ఏమున్నాయ్! అన్నీ మా మూలు విషయాలే!" అని జవాబిచ్చేడు కృష్ణ.

"కథ ఎంతవరకు వచ్చిందేమిటి?" సిగరెట్ పొగను విలాసంగా పైకి వదుల్తూ అడిగేడు బలరాం.

కృష్ణ ముఖం ఎఱ్ఱబారింది. "డొంక తిరుగుడుగా మాట్లాడటం నాకు చేత కాదు. మీ ఉద్దేశ్యమేమిటో మీరడగవల సిందేమిటో స్పష్టంగా చెప్పండి. అప్పుడు సమాధానమిస్తాను నేను." కటువుగా అన్నాడు.

ఎదురుచూడని అతని ధోరణికి విస్తుపోయేరు వాళ్ళు ముగ్గురూ అప్పటికి అంతకంటె ముందుకుపోయే ధైర్యం లేకపోయింది వాళ్ళకు.

"ఇప్పు డేమన్నామండీ అంత కోపం తెచ్చుకుంటారు ...?" జగన్నాధం ధోరణి మార్చేడు.

"... గుమ్మడికాయ దొంగెవరు అంటే భుజాలు తడుముకున్నట్లు ..." వాక్యం పూర్తి చేసేడు బలరాం.

అది ఆఫీసని, అసభ్య ప్రవర్తనకు తావుండకూడదని గుర్తుకు తెచ్చుకుని కృష్ణ తనని తాను నిగ్రహించుకున్నాడు కాని నిజానికి ఆ సమయంలో వాళ్ళని నిలువునా కాల్చి చంపేయాలన్నంత కోపం వచ్చిందతనికి.

రోజులు గడచి పోతున్నయ్. క్రమంగా సునంద, కృష్ణ సన్నిహితులు కాసాగేరు. దానికి ఒకరినొకరు అర్థం చేసుకుని, ఇష్టపడి ఏర్పరచుకున్న గౌరవాభిమానాలు ముఖ్యకారణ మైనప్పటికీ ఆఫీసులోని మిగతా ముగ్గురి సంకుచిత మనస్తత్వానికి నిరసన, విముఖత్వం తెలపటంలో యిద్దరూ భాగస్తులు కావటంకూడా ఒక కారణమే. జీవితాన్నిగూర్చి, ప్రపంచాన్ని గురించి, నైతిక సూత్రాలనుగురించి ఏకాభిప్రాయం గల యిద్దరు వ్యక్తులు గాఢ స్నేహితులు కావటానికి ఎంతోకాలం పట్టదు. అందునా అయిద్దరు స్త్రీ పురుషులు, అవివాహితులు అయినప్పుడు ఆ స్నేహం ప్రణయంగా మారి వారు జీవిత భాగస్వాములు కావాలని కోరుకోవటం అతి సహజం. కృష్ణ, సునందల మనసులు ఒకరిని విడిచి మరొకరు బ్రతకలేరన్నంతగా పెనవైచుకు పోయినయ్.

ఒక చల్లని సాయంత్రంవేళ కృష్ణ తన ప్రణయదేవతముందు ఆత్మనివేదన చేసుకోవటంకూడా జరిగింది.

ఐతే జీవితం అందరికీ పూలపాన్పు కాలేదు. అందునా సుందర కావ్యాలలో వలె వాస్తవిక జీవితంలోని యువతీ యువకుల ప్రణయం సాఫీగా, నిరంతరాయంగా జరిగిపోతుందనుకోవటంకూడా పొరపాటే!

సునంద, కృష్ణలు మానసికంగా, ఆధ్యాత్మికంగా పెనవైచుకు పోతున్న కొలదీ ఈర్ష్యాళువులైన తోటి ఉద్యోగస్తులు కళ్ళల్లో నిప్పులు పోసుకో



సాగేరు. వ్యక్తిగతంగా తనకేమాత్రం సంబంధంలేని ఒక స్త్రీ మరో పురుషుడితో చనువుగా తిరుగుతుంటే చూసి అసూయతో క్రుంగిపోయే విచిత్ర మనస్తత్వం ఒక్క భారతీయ పురుషులకే ఉంది. సునంద కృష్ణతో అంత సన్నిహితంగా ఉండటం చూసి తమ సొత్తు ఏదో అతను అపహరించుకు పోతున్నట్లు బాధపడ సాగేరు ఆముగ్గురూను. ఏదో రకంగా వాళ్ళను వేరుచెయ్యటమే తమ కర్తవ్యమని భావించేరు.

ఒకరోజున కృష్ణని మళ్ళీ కదిలించేరు "ఏం గురూ ! ఎంతవరకు నడిచిందేమిటి కథ ?" అనడిగాడు జగన్నాధం.

"ఇంకా మెల్లగా అడుగుతావేంటి ? పాకం ముదిరినట్లే ఉంది." వెకిలిగా నవ్వేడు బలరాం.

"మరీ ముదిరితే ప్రమాదం బ్రదర్ ! గట్టిగా నంటికి పట్టుకుని వేళ్ళాతుంది." జోక్ వేసాడు మూర్తి.

అందరూ ఆజోక్ కి గట్టిగా నవ్వేరు— ఒక్క కృష్ణతప్ప.

"ఇంతకీ మీరు అడగదల్చుకున్నది సునంద విషయమేనా ?" తీక్షణంగా అడిగేడు కృష్ణ.

"చల్లకొచ్చి ముంతదాయటం మాకు సరిపడదు."

"సరే. ఐతే నేనుచెప్తాను వినండి. సునందా, నేను కొద్దిరోజులలోనే వివాహం చేసుకోబోతున్నాం. ఇక తీరిందా మీసందేహం."

అతనలా గంటాడని ముందేతెలుసు వాళ్ళకు. అందువల్ల ఆశ్చర్యపోలేదు. ఐనా పైకి ముగ్గురూ షాక్ తిన్నట్లు ముఖంపెట్టి "ఏమిటి ! మీరు సునందను—

పెళ్ళి చేసుకొంటున్నారా ?" విస్మయంగా అన్నారు ఏక కంఠంతో.

"ఏం? ఎందుకంత ఆశ్చర్య పోతున్నారు : మేమిద్దరం కులాంతరులం కదా, మా పెళ్ళి ఎలా సాధ్యమౌతుందని అనుమాన పడుతున్నారా - నాకూ, సునందకీ యిద్దరికీ అలాటి పట్టింపులేవీ లేవు. భారతీయులు యింకా అజ్ఞానంలో, మూర్ఖత్వంలో పడి క్రుళ్ళిపోతున్నారనటానికి ఒకగొప్ప విదర్శనం... యీ కులమత భావాలతో కూడిన సమాజ వ్యవస్థ. పరస్పరానురాగంతో పెనవేసుకుపోయిన రెండు సున్నిత హృదయాలను విడదీయగలశక్తి మానవ కల్పితమైన వర్గభేదాలకు ఏమాత్రంలేదు.

మా పెద్దవాళ్ళతో చెప్పి వాళ్ళను మా పెళ్ళికి ఒప్పించటమో, లేక వాళ్ళు ఒప్పుకోని పక్షంలో వాళ్ళనుండి విడిపోయి మా అంతట మేమే వివాహం చేసుకోవటమో చేస్తాం. ఏమైనా కొద్దిరోజులలో మావివాహం జరిగి తీరటం తథ్యం " విశ్చయంగా, దృఢంగా అన్నాడు కృష్ణ.

ఒక్కక్షణం విశ్శబ్దం. వెంటనే ఒక పొడిదగ్గుదగ్గి చిన్నగా గొంతు సవరించుకుంటూ అన్నాడు జగన్నాధం. "అహాఁ. అదికాదు కృష్ణగారూ! మాఉద్దేశ్యం అది కాదు. కులమతాలంటే మాకుమాత్రం పట్టింపులూ పాడూ ఉన్నాయి? ఏదో పెద్దవాళ్ళ మనసు కష్టపెట్టటం యిష్టంలేక కులమింటి పిల్లనే చేసుకుందా మనుకుంటాంకాని నిజానికి మాకుమాత్రం తెలియదా కులంకన్నా ఎక్కువ గుణం ప్రధానమనీ..."

"ఔను. సునంద గుణాన్నిచూసే నేనామెను ప్రేమించేను." కృష్ణ అన్నాడు.

"అద్దో... అక్కడే కాస్త ముందూ వెనకా ఆలోచించాలంటున్నాను."

"అంటే మీ ఉద్దేశ్యం?" కనుబొమ లెత్తి సూటిగా జగన్నాధం కళ్ళలోకి చూసేడు కృష్ణ.

"వేరే విడమర్చి చెప్పాలాండీ గోపాలకృష్ణగారూ! ఐనా యీ రోజుల్లో చదువుకున్న ఆడదాన్ని...అందునా పెద్ద వాళ్ళతో ప్రమేయంలేకుండా పెళ్ళి చేసుకుంటే ఎన్నో విషయాలు ఆలోచించ వలసి ఉంటుంది. మీరు రాకముందు సునంద మాతో ఎలా ప్రవర్తించిందో మాకు తెలుసు." బలరాం అన్నాడు.

"ఏమిటి మీరనేది? సునంద ... మీతో...నా! ఎలా ప్రవర్తించిందేమిటి?" పిడికిళ్ళు బిగించేడు కృష్ణ.

"ముందు మాకు టోపీ వెయ్యాలని చూసింది. మాతో లాభంలేదనుకునేసరికి మీ వెంటపడింది." మూర్తి క్రాపును సుతారంగా పైకి తోసుకుంటూ అన్నాడు.

"టోపీ వెయ్యటమా? అంటే మీ ఉద్దేశ్యం?" పళ్ళు కొరుకుతూ రెండడుగులు ముందుకు వేసేడు కృష్ణ.

"ఈరోజుల్లో చదువుకున్న ఆడ



దానికి మొగుడెట్లా దొరుకుతాడండీ! వేలకువేలు కట్నాలుపొయ్యందే వరుళ్లు దొరుకుతారా? అందువల్ల చాలామంది అమ్మాయిలు ఒక కొత్తమార్గం కని పెట్టేరు. కనపడ్డ మగవాణ్ణల్లా 'కార్నర్' చెయ్యటం, చివరకు ఎవడో మీలాంటి అమాయకుడు ఆదర్శంపేరిట ఆత్మను చంపుకుని వీళ్ళ వలలో పడటం సర్వసాధారణమైపోయింది. లేకపోతే దాని మొహం ఆ సునంద నెవడు చేసుకుంటాడండీ! దున్నపోతులా పాతికేళ్లు పైబడ్డదాన్ని..." జగన్నాధం వివరించేడు.

"పాపం మీరుచూస్తే యేమీ అనుభవంలేనివాళ్ళలా ఉన్నారు. బాగానే మోసంచేసింది మిమ్మల్ని." సానుభూతి పలకబోసేడు మూర్తి.

"ఇప్పటికైనా కళ్లుతెరిచి మీదారిన మీరు పొండి. చేతులు కాలేక ఆకులు పట్టుకుని ఏం ప్రయోజనంలేదు" బలరాం సలహా ఇచ్చేడు.

"ఇంక ఆపండి!" గర్జించేడు కృష్ణ...ఆఫీసు గోడలు ఊడిపడేలా. "ఇంక సునందని గురించి మరోమాట అన్నారో మీ రక్తం కళ్ళజూస్తా. జాగ్రత్త! ఆమెకు నేను తాళిగట్టక పోయినా, లోకందృష్టిలో ఇంకా మేము భార్యాభర్తలం కాకపోయినా సునంద నా అర్ధాంగి. ఆమెనుగురించి అసభ్యంగా ఎలాంటి మాట అనటానికీ మీకు హక్కు లేదు తెలిసిందా? ఛీ! మీరూ మనుషులేనా? మీతో కలసి పనిచేస్తున్న ఒక స్త్రీనిగురించి ఇంత నీచంగా ఆలోచించ

టానికి, అన్ని కథలల్లడానికి మీకు మన సెలా ఒప్పింది? మీరు చదివిన చదువుకు సార్థకత యిదేనా? మీ సంస్కారం యొక్క అవధులు యివేనా - మీతో యేమాత్రం సంబంధంలేని స్త్రీనిగూర్చి అన్ని అపవాదులు సృష్టిస్తే మీకు లభించే ఆనందం యేమిటి? రెండు ప్రణయపూరిత హృదయాలను విడదీయటంద్వారా మీరు పొందే సంతృప్తి ఎలాటిది? సునందనుగురించి, అంగాంగ వర్ణనలుచేస్తూ మీరంతా ఎంత అసభ్యంగా మాట్లాడుకున్నదీ నేను చెవులారా విన్నాను. ఆమెముందు ఎంతో మర్యాదగా ప్రవర్తిస్తూ ఆమె అటు వీపుతిప్పగానే ఆమెవంక వెకిలిగా, లాలసగా, చులకనగా మీరు చూడటం కళ్ళారా చూసేను నేను. ఐనా మీ మీదగల అసహ్యాన్ని, ద్వేషాన్ని దిగమ్రింగుకుని ఊరుకున్నాను- గత్యంతరంలేక. ఆమెను పూర్తిగా అర్థం చేసుకుని, ఆమె ఎలాటి విషవలయంలో చిక్కుకున్నదో గ్రహించి, అన్నివిధాలా ఆలోచించే ఆమెను వివాహమాడటానికి నిశ్చయించుకున్నాను నా యీ నిశ్చయాన్ని మీరు కాదుగదా మిమ్మల్ని పుట్టించిన ఆ బ్రహ్మదేవుడు కూడా సడలించలేడు

ఇదే ఆఖరి వార్నింగ్‌గా చెపుతున్నాను. మరోసారి ఎప్పుడైనా సునందని గురించి నా ముందు అసభ్యంగా మాట్లాడేరో మీరు నాలోని పశుబలాన్ని రుచి చూడవలసివస్తుంది జాగ్రత్త!" అని ఒక్కక్షణంకూడా అక్కడ నిలబడక విడివిడిగా నడిచి వెళ్ళిపోయేడు కృష్ణ.

కళ్ళతో చూడకపోయినా తనమాటలని విన్నేసిన తరువాత వాళ్ళ ముగ్గురి ముఖాలు వెల్లవేసిన గోడల్లా ఎలా మారిపోయిందీ ఊహించుకోగలిగేడు కృష్ణ. కాని అంతవరకు తమ సంభాషణను పక్కగదిలో ఉండి సునంద వింటూన్నదని అతనికి తెలియదు.

అతను బస్సుస్టాపుకి వెళ్ళేసరికి సునంద అక్కడలేదు. ఆలస్యంఅవటం వల్ల తనకోసం ఉండకుండా ఆమె యింటికి వెళ్ళిపోయిందనుకున్నాడు కృష్ణ. మర్నాడు ఉదయమే ఆమెతో సంప్రదించి ఆమె తల్లిదండ్రులకు తమ వివాహాన్నిగూర్చి చెప్పాలనుకున్నాడు.

మర్నాడు ఉదయం రోజు కన్న త్వరగా ఆఫీసుకువెళ్ళేడు కృష్ణ ఆరోజు అతని మనసు ఎంతో కలవరంగా, ఉత్సాహంగా, ఉద్వేగ పూరితంగా ఉంది. ఇన్నాళ్ళూ తనకి సునందమీదగల ప్రేమ చాలావరకు మానసికమైనది. కాని త్వరలోనే ఆమె తన జీవిత భాగస్వామి కాబోతోందని. తన మనశ్శరీరాలను పునీతం చేస్తుందనీ అనుకుంటుంటే అతనికెంతో 'థ్రిల్లింగ్' గా ఉందా ఆలోచన.

ఆఫీసు గడియారం పదికొట్టేవరకు నిమిష నిమిషానికీ టైము చూసుకుంటూ,

గుమ్మంవైపు దృష్టి నిల్పి చూసేడు కృష్ణ. పదయినా సునంద రాకపోయేసరికి అతనికి గాభరావేసింది.

పది దాటినతరువాత ఒక్కొక్క నిమిషం లేటువచ్చినా సూపర్నెంటు ఊరుకోడు. అందువల్ల ఏ కారణంచేతనైనా లేటయినా అతనిచేత మాటలు పడటం యిష్టంలేక కాజువల్ లీవ్ పెడ్తుంటారు ఎవరైనాను. అందునా అసలే అభిమానవతియైన సునంద ఎప్పుడూ ఒక్కనిమిషంకూడా లేటుగారాదు. ఐతే కృష్ణకి ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే ఈరోజు సునంద ఆఫీసుకు రాకపోగా లీవ్ పెడ్తున్నట్లు ఉత్తరంకూడా వ్రాసి పంపలేదు. రేపు ఆఫీసుకు వస్తే సూపర్నెంటు ఆమె బాధ్యతారహిత ప్రవర్తనను ఎత్తిచూపి చీవాట్లు పెట్టేది ఊహించుకుని మరింత కంగారు పడసాగేడు కృష్ణ.

ఎలాగో ఆఫీసు పనయిందనిపించి సాయంత్రం యింటికి చేరుకున్నాడు కృష్ణ. నీరసంగా గదితాళం తీసి లోపలికి ప్రవేశించిన అతను కాలికి తగిలిన కవరును చూసి, ఆత్రంగా చింపి, ఉత్తరం చదివేడు.

"కృష్ణా!

నిన్ను యిలా పిలవటం యిదే మొదటిసారి. ఆఖరిసారికూడాను. మన స్నేహం చనువుగా మారకముందే, మన ప్రేమ ప్రణయ శృంగార లీలలోకి

రూపాంతరం చెందక మునుపే మన ఈ బంధం తెగిపోతుందని నేనూహించలేదు. కాని విధి బలీయం కృష్ణా!

సాయంత్రం ఆఫీసులో మీకూ, జగన్నాథం వాళ్ళకూ మధ్య జరిగిన సంభాషణ అంతా విన్నాను. ఇంటికి వచ్చాక మూడుగంటలసేపు తీవ్రంగా ఆలోచించి నేనీ నిర్ణయానికి వచ్చాను. మన వివాహం అసంభవం కృష్ణా! ఒకవేళ మనం ఇద్దరం తెగించి పెళ్ళిచేసుకున్నా సుఖ శాంతియుతంగా జీవించగలమన్న నమ్మకమైతే నాకు లేదు. తెలిసో, తెలియకో ఒక విషవలయంలోకి చిక్కుకున్నాను నేను. దీనినుండి బయటపడటం నా సాధ్యం కాదు. నేను దీనికి బలి అయి పోవలసిందే! తప్పదు.

నువ్వు నన్ను ఎంతగా ప్రేమిస్తున్నదీ నాకు తెలుసు. నేను లేనిదే నువ్వు బ్రతకలేని స్థితిలో ఉన్నావనికూడా నాకు తెలుసు. ఆమాత్రం ఆనందం, గర్వం నాకు చాలు యీ జీవితానికి. నువ్వు యీ సమయంలో వాళ్ళ మాటలను లెక్క చెయ్యకుండా నామీద ప్రేమాతిశయం కొద్దీ నన్ను పెళ్ళాడతావు. కాని వీళ్ళు మాత్రం మనల్ని యింతటితో వదిలి పెడ్తారనుకోవటం పొరపాటు కృష్ణా! మనం బ్రతికి ఉన్నంతకాలం మనమీద దుష్ప్రచారాలు చేస్తూ మనని పరోక్షంగా హింసిస్తూనే ఉంటారు. మన మనసులు వెయ్యి ముక్కలై మనసంసారం భగ్గున మండేదాకా వీళ్ళు మనల్ని బాధపెడ్తూనే ఉంటారు. ఆ స్థితిని ఎదుర్కోవలసి రాకుండా ముందుగానే సర్వమూ సమాప్తం చెయ్యటమే మంచిమార్గమని తోస్తోంది నాకు. వీళ్ళకు మనం చేసిన అన్యాయమేమిటో. వీళ్ళు ఎందుకింతగా మనమీద కక్ష కట్టేరో నాకైతే అర్థం కావటంలేదు. ఐనా నాపిచ్చికాని ద్వేషం అనేది ఆయా మనుష్యుల నైజ స్వభావాన్ని బట్టి ఆశ్రయిస్తుంది కాని దానికి కారణాలతో నిమిత్తం లేదన్న సంగతి నాకు మాత్రం తెలియదా! ఒక ప్రఖ్యాత రచయిత అన్నట్టు యీ లోకంలో ఎన్ని ఘన విజయాలనైనా సాధించవచ్చు. ఒక వ్యక్తిని సంహరించి, దేశాన్ని జయించవచ్చు. కాని అకారణ ద్వేషాన్ని మాత్రం జయించలేము! ఇది ముమ్మాటికీ నిజం!

ఆధునిక సమాజవ్యవస్థ ఒక పాతగోడ లాంటిది కృష్ణా! దూరం నుండి చూస్తే ఎంతో అందంగా, ఇద్దుగా కనిపిస్తుంది. కాని దానిలోపలికి ప్రవేశిస్తే కాని ఎంతో సున్నితంగా, సుందరంగా కనపడే ఆ దాంపుపొగుల విషపుకోరలున్న సత్యం అర్థంకాదు. చెక్కుచెదరని సూట్లవెనుక ఎంత సంకుచితపం ఉన్నదో, ఘుమఘుమ లాడే సెంట్లమాటున ఎన్ని కుళ్ళు భావాలు కదలాడుతున్నాయో తెలిసికోగల అవసరం, అవకాశం ప్రతిమనిషి జీవితంలోనూ ఎప్పుడో ఒకప్పుడు సంభవించక మానదు.



ముఖ్యంగా మన భారతీయుల స్థితి అధ్వాన్నంగా ఉంది. అటు సనాతన భారత సంస్కృతిలోని ఉదాత్తతను, యిటు ఆధునిక పాశ్చాత్య సంస్కృతిలోని విశాల దృక్పధాన్నీ రెంటినీకూడా జీర్ణించుకోలేకపోతోంది నేటి యువతరం. ముఖ్యంగా ప్రగతి పథంలో పయనిస్తున్న ఆధునిక స్త్రీ అనేక విమర్శలకు, అవమానాలకు గురికావలసిన దుస్థితి యేర్పడింది. స్త్రీని శక్తి స్వరూపిణిగా భావించే యీ పవిత్ర భారత దేశంలో స్త్రీని గూర్చి ఉన్నన్ని 'స్కాండల్సు', స్త్రీ పడుతున్న అగచాట్లు మరే యితరదేశంలోనూ సంభవించటంలేదు. దీనికి స్త్రీనిగురించి, జీవితాన్ని గురించి యువకులలో ఏర్పడిపోయిన తప్పు అభిప్రాయాలే ముఖ్య కారణం. ఈ జుగుప్సాకరమైన స్థి అంతమవ్వాలంటే భారత యువతీయువ రిలోనూ ఒక నైతిక విప్లవం బయల్ రాలి. స్త్రీకి గౌరవం లేకపోవటం దే పతనానికి మొదటమెట్టు అన్న సంగ అందరూ గుర్తించాలి. మన సమాజ అంతవరకు ఎదగటానికి యింకా ఎన్ని శతాబ్దాలు పడుతుందో!

కృష్ణా! ఇదంతా చదివి నువ్వు యేమనుకుంటున్నావో నాకు తెలుసు ఇన్ని విషయాలు తెలుసుకుని, ఇన్ని కబుర్లు చెప్పగలిగిన నేను ఒక సాధరణమైన 'బేబి' వలె ఆత్మహత్య ఎలా చేసికోగలిగేనా అన్న సందేహం నీక వస్తోందికదూ?

ఇన్ని విషయాలు తెలుసుకనుకనే పరిస్థితులను పూర్తిగా అర్థంచేసుక

న్నాను కనుకనే నేను ఆత్మహత్యకి సిద్ధమయ్యేను. నువ్వు నన్ను ఎంతగా ప్రేమించినప్పటికీ నువ్వు సాధారణ మానవుడివన్న సత్యాన్ని నేను ఎలా మర్చిపోగలను? సగటు మానవత్వపు విలువలే మంటగలసిపోతున్న యీరోజుల్లో మనిషిని దేవుడిగా ఊహించుకోగల విశాల హృదయం, ఆశాదృష్టి ఏర్పరచుకోవటం నాకు చేతకాదు. తొలి ప్రేమ తాలూకు వేడిలో నువ్వు నన్ను పెళ్ళాడినప్పటికీ ఆతరువాతకూడా వీళ్ళ విమర్శలను, సఁహాలను లెక్కచేయవనీ, కనీసం బాధపడకుండానైనా ఉండగలవనీ నేననుకోను. చితికిపోయే సున్నిత హృదయాలు, నలిగిపోయే కోమల భావాలు దాంపత్య జీవితాన్ని ఎన్నటికీ సుఖవంతం చేయలేవు. పరీక్షలకు, త్యాగాలకు తట్టుకుని మొద్దుబారిపోయిన ప్రేమమీద నాకు మోజులేదు. అప్పుడే విచ్చుకున్న మల్లెపువ్వులాటి మధుర సౌరభాలతో గూడిన ప్రేమ కావాలి నాకు — దాని ఉనికి కాలం ఎంత పరిమితమైనదైనా సరే... అందుకే నేనీ లోకంనుండి నిష్క్రమించ దల్చుకున్నాను.

ద్వేషానికి, దౌర్జన్యానికి, అక్రమాలకు, అన్యాయాలకు తావులేని మరో లోకంలో మన ప్రేమ సాఫల్యంకోసం నిరీక్షిస్తూంటాను.

జన్మజన్మలకీ నీ దాసనైన,
సునంద.''

ఉత్తరం చదవటం అవగానే కృష్ణకు పక్కలు విరిగిపోయేయి. "అయ్యో! సునందా! ఎంతపని చేసేవు సునందా! నన్ను అర్థంచేసుకున్నది యింతేనా? నా ప్రేమను గురించి నీకు తెలిసిందిదేనా? నువ్వు లేనితరువాత నాయీ దేహంలోని అర్థభాగం ఎలా యీ లోకంలో ఉండగల దనుకున్నావు? నేనిప్పుడు సగం మనిషిని సునందా, సగం మనిషిని. ఆ సంగతి నీకెలా తెలిసేది?" అంటూ రోదించసాగేడు.

జీవితాన్నిగూర్చి ఎన్నో అభిప్రాయాలేర్పరచుకుని, భవిష్యత్తును గురించి ఎన్నో బంగారుకలలు కంటున్న ఆ యువకుడికి తగిలిన గాయంతాలూకు బాధనుండి విముక్తుడవటానికి ఒక్కటే మార్గం కనిపించింది. వెంటనే లేచి, మందులషాపుకు వెళ్ళి నిద్రమాత్రల సీసా కొనుక్కొచ్చేడు. రాత్రయాక వాటన్నిటినీ మింగి నిశ్చింతగా మంచంమీద వాలేడు. కొన్ని గంటలలోనే అతని ఆత్మ భౌతిక దేహాన్ని వదలి తన ప్రేయసిని చేరుకుంది.